# సాక్షి వికారాబాద్

ఆదివారం । 22 । డిసెంబర్ । 2024






## గోవా టు హైదరాబాద్

న్యూ ఇయర్ వేడుకలకు కొందరు వ్యక్తులు గోవా నుంచి తరలిస్తున్న మద్యం బాటిళ్లను ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారు. 8లో▸



## ప్రాణం తీసిన..

మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు.. ఆమెపై అనుమానం పెంచుకున్నాడు.. కూతురు ముందే దాడి చేశాడు. 8లో▸



## కంకర రోడ్డుతో కష్టాలు!

కంకర రోడ్డుపై రాకపోకలు ఇబ్బందిగా ఉన్నాయని, సమస్యలు పరిష్కరించాలని వాహనదారులు డిమాండ్ చేశారు. 9లో▸

## న్యూస్‌రీల్

### చట్టాలు అతిక్రమిస్తే చర్యలు

ఎస్పీ నారాయణరెడ్డి



రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ

దౌల్తాబాద్: 'చట్టాలు అతిక్రమించిన వారు ఎంతటి వారైనా.. ఉపేక్షించేంది లేదు. వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి' అని ఎస్పీ నారాయణరెడ్డి అన్నారు. వార్షిక తనిఖీల్లో భాగంగా శనివారం ఆయన మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ రవిగౌడ్ పూలమొక్క అందజేసి స్వాగతం పలికారు. పోలీసులు గౌరవవందనం చేశారు. ఈ సందర్భంగా ఆయన.. రికార్డులు పరిశీలించారు. పూర్వ కేసుల స్థితిగతులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. శాంతిభద్రతల విషయంలో సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేది లేదని స్పష్టంచేశారు. ఠాణాకు వచ్చే ఫిర్యాదుదారుడితో మర్యాద పూర్వకంగా వ్యవహరించాలని సూచించారు. మండలంలో క్రైం రేటు చాలా తక్కువగా ఉందని సిబ్బంది పనితీరుపై సంతృప్తి వ్యక్తంచేశారు. గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా అవగహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో డీఎస్పీ శ్రీనివాస్, సీఐ శ్రీధర్‌రెడ్డి, ఎస్‌ఐ రవిగౌడ్ తదితరులున్నారు.

### భూ నిర్వాసితులకు ప్లాట్ల పంపిణీ



పట్టాలు అందజేస్తున్న అధికారులు

కొడంగల్ రూరల్: మెడికల్, వెటర్నరీ కళాశాలల నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులకు ప్రభుత్వం ఇళ్ల స్థలాలను పంపిణీ చేస్తోంది. ఇందులో భాగంగా శనివారం తహసీల్దార్ విజయ్‌కుమార్, సబ్ రిజిస్ట్రార్ రవికాంత్ అప్పాయిపల్లి గ్రామ రైతులకు ఇళ్ల పట్టాలు అందజేశారు. డీటీసీపీ లేఅవుట్ ద్వారా ఉచితంగా రిజిస్ట్రేషన్ చేయించి, రైతులకు అందజేస్తున్నారు.

### సార్.. నిధులివ్వండి



సీఎంకు వివరిస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పరిగి: నియోజక వర్గ అభివృద్ధికి నిధులు కేటాయించాలని ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి కోరారు. ఈ మేరకు శనివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఇంటిగ్రేటెడ్ రెసిడెన్సియల్ స్కూల్, పలు డబుల్ రోడ్ల నిర్మాణం గురించి ప్రస్తావిస్తూ.. ఎక్కడెక్కడ ఎన్ని నిధులు కావాలో రేవంత్‌కు వివరించారు. దీనికి సీఎం.. సానుకూలంగా స్పందించారని టీఆర్‌ఆర్ పేర్కొన్నారు.

### సీఎం కప్ రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక



పుష్పలత

తాండూరు రూరల్: మండల పరిధిలోని జినుగుర్తి గేటు వద్ద ఉన్న తెలంగాణ మోడల్ స్కూల్ విద్యార్థి పుష్పలత రాష్ట్ర స్థాయి సీఎం కప్ పోటీలకు ఎంపికైంది. రెండు రోజులుగా కొడంగల్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో సత్తాచాటిన ఆమెను రాష్ట్ర స్థాయికి ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. డిసెంబర్ 30 నుంచి జనవరి 2వరకు మహబూబ్‌నగర్‌లో నిర్వహించే పోటీల్లో పుష్పలత జిల్లా జట్టు తరఫున ప్రాతినిధ్యం వహించనుంది. ప్రిన్సిపల్ శ్రీదేవి, పీఈటీ యాదగిరి, అధ్యాపకులు, తోటి విద్యార్థులు ఆమెను అభినందించారు.

### మున్సిపాలిటీ ఏర్పాటు వద్దు

మొయినాబాద్: మండలంలోని గ్రామ పంచాయతీలను మున్సిపాలిటీగా ఏర్పాటు చేయొద్దని చిలుకూరు గ్రామస్తులు నిరసన వ్యక్తం చేశారు. ఈ మేరకు చిలుకూరు బాలాజీ దేవాలయం ఎదుట శనివారం 'మున్సిపాలిటీ వద్దు.. గ్రామ పంచాయతే ముద్దు' అంటూ నినాదాలు చేశారు. స్వామివారు పాలకుల బుద్ధి మార్చి గ్రామ పంచాయతీలుగానే ఉండేలా చూడాలని మొక్కుకున్నారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ పురాణం వీరభద్రస్వామి మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాలను మున్సిపాలిటీలుగా చేయడం ద్వారా ప్రజలకు ఎలాంటి ప్రయోజనం ఉండదన్నారు.




## సూత్రం పట్టుకో.. సులువుగా నేర్చుకో

భయం వీడు.. లెక్కలపై పట్టు సాధించు

- సూత్రాలతో నేర్చుకుంటే సులువు
- చిత్రపటాలతో మరింత చేరువ
- నేడు జాతీయ గణిత దినోత్సవం

గణిత శాస్త్రం అంటే చాలా మంది విద్యార్థులకు తెలియని భయం. తరగతిలో మెజారిటీ మందికి లెక్కల పరీక్ష రాగానే ఆందోళన. సామాన్య, సాంఘిక తదితర సబ్జెక్టులకంటే.. మ్యాథ్స్ సులువైనప్పటికీ.. పిల్లలు లెక్కల్లో తప్పతుంటారు. తొలుత భయం వీడి.. తరగతి గదిలో ఉపాధ్యాయులు చెప్పింది విని.. అనుసరిస్తే.. గణితాన్ని ఒడిసిపట్టవచ్చని నిపుణులు పేర్కొంటున్నారు. కొన్ని ప్రత్యేక సూత్రాలపై పట్టుసాధిస్తే.. గణితం నిజజీవిత గమనంగా మారుతుందని వెల్లడిస్తున్నారు. గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా ప్రత్యేక కథనాలు..

వివరాలు 8లో▸



మధ్యాహ్న భోజనంలో పురుగులు

## మధ్యాహ్న భోజనంలో పురుగులు

- చౌడాపూర్ పాఠశాలలో ఘటన
- స్కూల్‌ను సందర్శించిన తహసీల్దార్
- విద్యార్థులు, సిబ్బంది నుంచి వివరాల సేకరణ

కుల్కచర్ల: ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాల్లో భోజనం సమస్యలపై నిత్యం ఏదో ఒక చోట సమస్యలు వెలుగుచూస్తున్నా.. అధికారుల తీరులో మార్పు రావడం లేదు. చౌడాపూర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం వడ్డించిన మధ్యాహ్న భోజనంలో పురుగులు రావడం కలకలం రేపింది. విద్యార్థులు భోజనం చేస్తున్న సమయంలో వెళ్లిన గ్రామస్తులు ప్లేట్లలోని అన్నాన్ని పరిశీలించగా పురుగులు కనిపించాయి. ఈ విషయమై సిబ్బందిని నిలదీశారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు మాట్లాడుతూ.. సరైన భోజనం వడ్డించడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. కడుపు మాడ్చుకోలేక పెట్టింది తింటున్నామని చెప్పారు. ఈ విషయాలు సోషల్ మీడియాలో ప్రచారం కావడంతో చౌడాపూర్ తహసీల్దార్ ప్రభు స్కూల్‌కు చేరుకుని విద్యార్థులతో మాట్లాడారు. మధ్యాహ్న భోజనంలో నాణ్యత ఉండటంలేదని విద్యార్థులు ఆయనకు చెప్పడంతో ఇకనుంచి నిర్లక్ష్యం జరిగితే కఠిన చర్యలు తప్పవని హెచ్‌ఎం భాగ్యవతి, ఉపాధ్యాయులను హెచ్చరించారు.

## నెరవేరని లక్ష్యం!



కొనుగోలు కేంద్రాల ద్వారా ప్రభుత్వం సేకరించిన ధాన్యం

**తుది దశకు ధాన్యం కొనుగోళ్లు**

- దిగుబడి అంచనా 2.8 లక్షల మెట్రిక్ టన్నులు
- కొనుగోలు లక్ష్యం 1.5లక్షలు
- 40శాతం దాటని సేకరణ
- అధికంగా ఓపెన్ మార్కెట్‌లో విక్రయం

వికారాబాద్: ఓ పక్క కొనుగోలు కేంద్రాల నిర్వాహకుల కొర్రీలు.. మరో పక్క డబ్బులు వెంటనే ఇవ్వకపోవటం తదితర కారణాలతో రైతన్నలకు తిప్పలు తప్పడం లేదు. దీంతో కర్షకులు దళారుల గడప తొక్కడం అనివార్యం అయింది. తేమ, తాలు పేరుతో ఇబ్బంది పెడుతుండటంతో చేసేది లేక ధాన్యం కల్లాల్లో పెట్టుకుని పడిగాపులు గాస్తున్నారు. చివరకు అరకొర ధరకు వ్యాపారులకు విక్రయించి నష్టపోతున్నారు. అన్నదాతలను ఇబ్బందులకు గురిచేయవద్దని ప్రభుత్వం, ఉన్నతాధికారులు చెప్పినా.. క్షేత్రస్థాయి కొనుగోలు కేంద్రాల్లో మార్పు రావడం లేదు.

### తెలంగాణ టు కర్ణాటక

కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ ముగింపు దశకు చేరుకోగా.. సేకరణ లక్ష్యం 40 శాతమే నెరవేరింది. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే ఎక్కువ ధర ఉన్నప్పటికీ.. రైతులు దళారులను ఆశ్రయిస్తున్నారంటే.. నిర్వాహకుల కొర్రీలు ఏ స్థాయిలో ఉన్నాయో తెలుస్తోంది. ఇదిలా ఉండగా.. గతంలో కొంత తక్కువ మొత్తంలో కర్ణాటక వ్యాపారులకు రైతులు ధాన్యం విక్రయించగా, ఈ సారి దిగుబడిలో అధికశాతం వారికే అమ్మేశారు. కర్ణాటకలో ధాన్యంతో బొంగులు(మురుమురాలు) తయారు చేసే వ్యాపారం పెద్ద మొత్తంలో జరుగుతోంది. ఆ ప్రాంత వ్యాపారులకు వికారాబాద్ జిల్లా సరిహద్దు కావటంతో ఇక్కడ అధిక మొత్తంలో ధ్యాన్యం కొనుగోలు చేస్తుంటారు. ఈ కారణంతో ధాన్యం ఇక్కడి కొనుగోలు కేంద్రాలకు రావటం తగ్గిందని అధికారులు పేర్కొంటున్నారు.

### దళారుల పాలు

ప్రస్తుత సీజన్‌లో కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి రెండు నెలలు కావస్తోంది. ధాన్యం కొనుగోళ్లు ముగింపు దశకు చేరుకోగా.. ఈ నెలాఖరు వరకు సెంటర్లను మూసి వేసేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. ఇప్పటి వరకు కేవలం రైతుల నుంచి దొడ్డు రకం ధాన్యం 35,766 మెట్రిక్ టన్నులు, 5,500 మెట్రిక్ టన్నుల సన్నరకం ధాన్యం కొనుగోలు చేశారు. మొత్తంగా చూస్తే దిగుబడిలో 20 శాతం కొనుగోలు చేయగా.. పెట్టుకున్న లక్ష్యంలో 40 శాతం కొనుగోలు కేంద్రాల ద్వారా ప్రభుత్వం సేకరించింది. మిగతా ధాన్యం దళారులు, ఓపెన్ మార్కెట్ పాలయింది.

### డబ్బుల చెల్లింపులో జాప్యం

యాసంగి సీజన్‌తో పోలిస్తే ఈ సారి కొనుగోలు కేంద్రాల సంఖ్య పెంచారు. ఖరీఫ్‌లో 126 కేంద్రాలు ఏర్పాటు చేయగా, వాటిలో 108 సాధారణ రకం, మిగతా 18 కేంద్రాల్లో సన్నరకం ధాన్యం సేకరించేందుకు ఏర్పాటు చేశారు. జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్‌లో 1.30 లక్షల ఎకరాల విస్తీర్ణంలో వరి సాగు చేయగా.. ఎకరానికి సగటున 20 నుంచి 25 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని అంచనా వేశారు. ఈ లెక్కన జిల్లాలో 2.8 లక్షల మెట్రిక్ టన్నుల పంట వస్తుందని వ్యవసాయ శాఖ పేర్కొంది. అయితే ఇందులో సీడ్ వరి తదితర ధాన్యం పోను, కొనుగోలు కేంద్రాలకు 1,05,000 మెట్రిక్ టన్నుల ధాన్యం వచ్చే అవకాశం ఉందని ఆ శాఖ అధికారులు అంచనా వేశారు. ఏ గ్రేడ్ రకం ధాన్యం క్వింటాల్‌కు రూ.2,320 చెల్లించనుండగా, బీ గ్రేడ్ రకానికి రూ.2,300 చెల్లిస్తున్నారు. సన్నరకం వరి క్వింటాల్‌కు రూ.500 బోనస్‌గా ప్రభుత్వం చెల్లిస్తోంది. ఈ చెల్లింపుల్లో తీవ్ర జాప్యం అవుతోంది. కొందరు రైతుల ఖాతాల్లో డబ్బులు జమ కావటానికి నెల సమయం పడుతున్నట్లు సమాచారం. ప్రభుత్వం ఇప్పటి వరకు సేకరించిన ధాన్యానికి సంబంధించి రూ.98.73 కోట్లు చెల్లించాల్సి ఉండగా.. రూ.74 కోట్లు రైతులకు చెల్లించారు. మరో రూ.24 కోట్లు ఇంకా రైతుల ఖాతాల్లో జమ కావాల్సి ఉంది.

## ఆరంభం.. అట్టహాసం

- ప్రారంభమైన పత్రీజీ ధ్యాన మహాయాగ వేడుకలు
- జ్యోతి ప్రజ్వలన చేసిన ఎంపీలు మల్లురవి, నాగరాజు
- వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన ధ్యానులు



ధ్యానంలో మహిళ

కడ్తాల్: మండల కేంద్రం సమీపంలోని మహేశ్వర మహాపిరమిడ్‌లో శనివారం ధ్యాన జనుల సందడి మధ్య పత్రీజీ ధ్యాన మహాయాగం-3 వేడుకలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. నాగర్‌కర్నూల్, కర్నూలు ఎంపీలు మల్లురవి, నాగరాజు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పిరమిడ్ మాస్టర్లు, దివంగత ధ్యాన గురువు సుభాష్ పత్రీజీ కూతురు పరిణిత, ట్రస్ట్ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డితో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. ఎంపీ మల్లురవి మాట్లాడుతూ.. ధ్యానాన్ని ప్రపంచానికి పరిచయం చేసిన గొప్ప వ్యక్తి పత్రీజీ అని, ధ్యానమయ సమాజం కోసం ఆయన చేసిన కృషి ప్రశంసనీయనీయమని కొనియాడారు. పత్రీజీ చూపిన ధ్యాన మార్గం అనుసరణీయమని పేర్కొన్నారు. ధ్యానంతో ఆరోగ్యంతో పాటు, మానసిక వికాసం పెంపొందుతుందని తెలిపారు. కర్నూల్ ఎంపీ నాగరాజు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ధ్యాన సాధన చేయాలని, ధ్యానంతో తమ జీవితాలను బాగు చేసుకోవాలని సూచించారు. పత్రీజీ ఆశయాలకు అనుగుణంగా ధ్యాన యజ్ఞం నిరంతరం కొనసాగాలని ఆకాంక్షించారు.

**అఖండ జ్యోతికి ఘన స్వాగతం**

అంతకు ముందు రాష్ట్రం నలుమూలాల నుంచి తిరిగి వచ్చిన అఖండ జ్యోతికి కడ్తాల్‌లో ధ్యానులు ఘన స్వాగతం పలికారు. అక్కడి నుంచి అఖండ జ్యోతితో పిరమిడ్ వద్దకు ర్యాలీగా సాగారు. పలువురు పిరమిడ్ మాస్టర్ల సందేశాలు, సంగీత కార్యక్రమాలు అలరించాయి. ధ్యానులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా ట్రస్టు నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, మీడియా కోఆర్డినేటర్ భాస్కర్‌రెడ్డి, డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు దశరథ్‌నాయక్, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్ గుప్తా, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎంపీలు మల్లురవి, నాగరాజు

## పేరుకే మున్సిపాలిటీ



తుర్కయంజాల్ నాలా వద్ద పేరుకుపోయిన మురుగునీరు

- ముగియనున్న పాలకమండళ్ల పదవీకాలం
- కనీస వసతులకు నోచుకోని జనం
- ఇప్పటికీ పూర్తికాని అండర్ డ్రైనేజీ పనులు
- ఇళ్ల మధ్యే పారుతున్న మురుగునీరు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ఏళ్లు గడుస్తున్నా మున్సిపాలిటీల్లో అభివృద్ధి పనులు అంతంత మాత్రంగానే సాగుతున్నాయి. పలు మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలోని ప్రజలు ఇప్పటికీ కనీస మౌలిక సదుపాయాలకు నోచుకోలేకపోతున్నారు. విశాలమైన రోడ్లు సంగతేమో కానీ.. ఆశించిన స్థాయిలో మురుగునీటి కాల్వలు కూడా లేకపోవడంతో ఇళ్ల నుంచి వెలువడిన మురుగు వీధుల్లో ఏరులై ప్రవహిస్తోంది. స్థానికుల ముక్కు పుటాలను అదరగొడుతోంది. ఈగలు, దోమలకు నిలయంగా మారి ప్రజల అనారోగ్యానికి కారణమవుతోంది.

**ఇళ్ల మధ్యే మురుగునీటి ప్రవాహం**

జిల్లాలో మూడు మున్సిపల్ కార్పొరేషన్లు సహా 13 మున్సిపాలిటీలు ఉన్నాయి. ఇవి పూర్తిగా నగరానికి ఆనుకుని ఉన్నాయి. వీటి పరిధిలో మొత్తం 363 వార్డులు, 51.05 కిలోమీటర్ల ఓపెన్ డ్రైనేజీలు ఉండగా, 924.37 కిలోమీటర్ల అండర్ గ్రౌండ్ డ్రైనేజీలు, మరో 381.71 కిలోమీటర్ల కచ్చ డ్రైనేజీలు ఉన్నాయి. శంషాబాద్, శంకర్‌పల్లి, జల్‌పల్లి, తుర్కయంజాల్, పెద్ద అంబర్‌పేట్, ఇబ్రహీంపట్నం, షాద్‌నగర్ మున్సిపాలిటీల్లో ఆశించిన స్థాయిలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీలు లేకపోవడంతో ఇళ్ల మధ్యే మురుగునీరు ప్రవహిస్తోంది. ఆస్తిపన్ను వసూళ్లు సహా ప్రభుత్వం వివిధ గ్రాంట్ల రూపంలో ఆయా మున్సిపాలిటీలకు పెద్ద మొత్తంలో నిధులు కేటాయిస్తున్నప్పటికీ మౌలిక వసతులు మాత్రం మెరుగుపడటం లేదు. పట్టణ ప్రగతి సహా ఎస్‌ఆర్‌డీపీ ప్రాజెక్టుల్లో భాగంగా గత ప్రభుత్వం ఆయా మున్సిపాలిటీలకు పెద్ద మొత్తంలో నిధులు మంజూరు చేసినా ఆశించిన స్థాయిలో అభివృద్ధి చెందలేదు. ఎస్‌ఆర్‌డీపీ కింద ఇప్పటికే చేపట్టిన పనులు పూర్తి కాలేదు. శంకర్‌పల్లి మెయిన్‌రోడ్డులో టీయూఎఫ్‌ఐడీసీ నిధులతో రెండు కిలోమీటర్ల మేర చేపట్టిన పనులు ఏడాది కాలంగా కొనసాగుతున్నాయి. మీర్‌పేట్, బడంగ్‌పేట మున్సిపాలిటీల్లో డ్రైనేజీ పనులు ఏళ్లుగా సాగుతున్నాయి. ఎప్పటికప్పుడు ఆయా పనులను పర్యవేక్షించాల్సిన అధికారులు, ప్రజాప్రతినిధులు తమకేమీ పట్టనట్లు వ్యవహరించడంతో స్థానిక ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు.

**ముంచుకొస్తున్న ముప్పు**

పాలక వర్గాలు ఏర్పడి ఐదేళ్లు పూర్తి కావస్తోంది. జనవరి చివరి వారంతో ఆయా పాలక మండళ్ల గడువు ముగియనుంది. నాలుగేళ్లుగా స్థానికుల అవసరాలను పట్టించుకోని కార్పొరేటర్లు, కౌన్సిలర్లు మళ్లీ ఎన్నికలు వస్తుండటంతో కొత్త పనుల శంకుస్థాపనకు శ్రీకారం చుట్టారు. ఆఘమేఘాల మీద కౌన్సిల్ మీటింగ్‌లు ఏర్పాటు చేయడం, ఎజెండాలో ఆయా అంశాలను పెట్టి ఏకంగా తీర్మానాలు చేయడం చకచకా జరిగిపోతున్నాయి. ఇంతకాలం ఫంక్షన్‌హాళ్లు, కన్వెన్షన్ సెంటర్లు, బహుళ అంతస్తుల భవనాలు, బంధువులు, రియల్టర్ల సేవల్లో తరించిన పాలకులకు అకస్మాత్తుగా ఓటర్లు గుర్తు రావడం, ఆ మేరకు వారి మౌలిక అవసరాలు గుర్తించి, బడ్జెట్ కేటాయింపులు చేయించి శంకుస్థాపనలు చేయిస్తుండటంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

## చెరసాల నుంచి.. చేనుబాట



తమ కుటుంబ సభ్యులు జైలు నుంచి వస్తున్న సందర్భంగా నినాదాలు చేస్తున్న మహిళలు (ఫైల్)

**పొలం పనుల్లో లగచర్ల గిరిజన రైతులు బిజీ**

- నరకం నుంచి విముక్తి కలిగిందంటున్న కర్షకులు
- గ్రామాల్లో నెలకొన్న ప్రశాంత వాతావరణం

దుద్యాల్: ఆటపాటలతో నేల తల్లి ఒడిలో జీవనం సాగించే గిరిజనులకు లగచర్ల ఘటన వారి జీవితాల్లో మరిచిపోలేనిది. తమ భూములను కాపాడుకోవడానికి జరిగిన పోరాటంలో చోటుచేసుకున్న పొరపాటుకు జైలు పాలైన లగచర్ల, రోటిబండతండా, పులిచర్లకుంటతండాలకు చెందిన రైతులు.. 37 రోజులుగా జైలు జీవితం గడిపారు. కటకటాల నుంచి శుక్రవారం విడుదలైన కర్షకులు.. శనివారం తమ కుటుంబ సభ్యులతో కలిసి పొలం బాట పట్టారు. జైలు జీవితం వారి మాటల్లోనే..



### జీవితంపై విరక్తి కల్గింది

కటకటాల్లో ఉన్నన్ని రోజులు బతుకుపై విరక్తి కలిగింది. నిత్యం ఏదో ఒక పని చేసుకుని ప్రశాంతంగా జీవించే నేను.. జైలు పాలు కావడంతో నా కుటుంబం మనోవేదనకు గురయింది. పంచాయితీతో ప్రమేయం లేకున్నా పోలీసులు తీసుకెళ్లారు. 37 రోజులు నిద్రాహారాలు లేకుండా గడిపా. ఇటీవలే ప్రేమ వివాహం చేసున్నా. కుటుంబానికి దూరంగా ఉండడం కంటే చచ్చిపోవడం మేలనిపించింది. పొలానికి రాగానే పశువులు నన్ను చూసి అరిచాయి. దీంతో నాకు ఏడుపు వచ్చింది. సంతోషంగా వాటికి స్నానం చేయించా.

– వినోద్ నాయక్, రోటి బండ తండా

### పొలం చూడననుకున్నా..



బంధీఖానాలో గుండెపోటు వచ్చినప్పుడు ఇక బతకను, పొలంను చూడను అనుకున్న. అదృష్టం బాగుండి బతికి బయటపడి ఊరుకొచ్చాను. కంది పంటను 10 రోజుల క్రితమే కోసేదుండే. కానీ.. కుటుంబీకులు నావద్దకు వచ్చేసరికి పనులు ఆగిపోయాయి. ఇప్పుడు పొలం పనులు చేయండం సంతోషంగా ఉంది. భూమి కోసం జైలు పాలయ్యాం. నేలతల్లితోనే మా జీవితాలు. మా భూముల జోలికి రావొద్దు.

– హీర్యా నాయక్(గుండెపోటు వచ్చిన వ్యక్తి), పులిచర్లకుండ తండా

### జైలు జీవితం నరకం



జైలు జీవితం ఒక నరకం. పొలం పనుల్లో ఉండే మేము.. కటకటాల్లో ఉండలేకపోయాం. సరిగా నిద్ర పోలేదు. తిండి తినలేకపోయాం. ఒకానొక సందర్భంలో చనిపోవాలని అనిపించింది. బెయిల్ వచ్చింది అనగానే కంటి నిండ నిద్ర పోయాను. ఇంటికి వచ్చిన తర్వాత పొలంను చూడాలని శనివారం నిద్ర లేవగానే వెళ్లాను. అక్కడికి వెళ్లగానే ఏడుపు వచ్చింది. వరి నారు వేసేందుకు సిద్ధమవుతున్నాము.

– హీర్యా నాయక్, పులిచర్లకుంట తండా

## క్లుప్తంగా

### సర్వే సెలవులు మంజూరు చేయాలని వినతి



ఎంపీడీఓ బన్సీలాల్‌కు వినతిపత్రం అందజేస్తున్న యూటీఎఫ్‌ నాయకులు

**షాద్‌నగర్‌రూరల్‌:** గత నెలలో ప్రభుత్వం నిర్వహించిన సమగ్ర కుల సర్వేలో పాల్గొన్న ఉపాధ్యాయులకు రెమ్యూనరేషన్‌, సీసీఎల్‌ సెలవులను మంజూరు చేయాలని టీఎస్‌ యూటీఎఫ్‌ నాయకులు కోరారు. ఈ మేరకు ఎంపీడీఓ బన్సీలాల్‌కు యూటీఎఫ్‌ నాయకలు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం చేపట్టిన సమగ్ర సర్వేలో పాల్గొన్న ఉపాధ్యాయులు తమ సెలవులను కోల్పోయి ప్రభుత్వ సెలవు రోజుల్లో కూడా పాలుపంచుకొని సర్వేను విజయవంతంగా పూర్తి చేశారన్నారు. సర్వేలో పాల్గొన్న ఉపాధ్యాయులకు ప్రభుత్వం నిర్ణయించిన రెమ్యూనరేషన్‌ను ఉపాధ్యాయుల ఖాతాలో జమ చేయడంతో పాటుగా సెలవు రోజుల్లో పనిచేసిన ఉపాధ్యాయులకు సీసీఎల్‌ను మంజూరు చేయాలని డిమాండ్‌ చేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో యూటీఎఫ్‌ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్‌, ప్రధాన కార్యదర్శి బిజిలి సత్యం, ఉపాధ్యక్షురాలు లక్ష్మీదేవమ్మ, నాయకులు అరుణ, కృష్ణ, బాలయ్య, వేణు, శేఖర్‌గౌడ్‌ పాల్గొన్నారు.

### మనవడికి లంచ్‌ బాక్స్‌ తీసుకెళ్లిన వృద్ధుడి అదృశ్యం



బాబురావు బిరదర్‌(ఫైల్‌)

**పహాడీషరీఫ్‌:** మనవడికి లంచ్‌ బాక్స్‌ ఇచ్చేందుకు పాఠశాలకు వెళ్లిన ఓ వృద్ధుడు కనిపించకుండా పోయిన సంఘటన పహాడీషరీఫ్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీరాం కాలనీ నిత్య ఎన్‌క్లేవ్‌కు చెందిన బాబురావు బిరదర్‌(62) ఈ నెల 20న ఉదయం 11.55 గంటలకు స్థానికంగా ఉన్న శ్రీ చైతన్య హైస్కూల్‌లో చదివే మనవడికి లంచ్‌ బాక్స్‌ ఇచ్చేందుకు వెళ్లి తిరిగి రాలేదు. ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు అతని ఆచూకీ కోసం గాలించినా ఫలితం లేకుండా పోయింది. బాబురావు తొమ్మిది నెలల నుంచి అనారోగ్యంతో బాధపడుతున్నాడు. అతని కుమారుడు బిరదర్‌ అమోల్‌ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు పోలీస్‌ స్టేషన్‌లో లేదా, 87126 62367 నంబర్‌కు ఫోన్‌ చేసి సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు.

### హిందువుల మనోభావాలను దెబ్బ తీయొద్దు

చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి



తోల్‌కట్ట చౌరస్తాలో ధర్నాలో పాల్గొన్న ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి తదితరులు

**మొయినాబాద్‌రూరల్‌:** హిందువుల మనోభావాలను దెబ్బతీయొద్దని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. మండలంలోని తోల్‌కట్ట సమీపంలో ఉన్న హనుమాన్‌ దేవాలయం నుంచి శుక్రవారం రాత్రి దుండగులు విగ్రహం, పూజా సామగ్రి బయట పడేయడంపై బీజేపీ నాయకులు ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. ఇలాంటి చర్యలకు పాల్పడినవారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్‌ చేశారు. మొయినాబాద్‌ సీఐ పవన్‌కుమార్‌రెడ్డి సిబ్బందితో కలిసి అక్కడికి చేరుకున్నారు. రెండుమూడు రోజుల్లో దుండగులను పట్టుకొని కేసులు నమోదు చేస్తామని నచ్చజెప్పడంతో వారు ఆందోళన విరమించారు. మాజీ ఎమ్మెల్యే కేఎస్‌ రత్నం, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీరామ్‌నగర్‌ ప్రభాకర్‌రెడ్డి ఉన్నారు.



### సులభ రీతిలో బోధించాలి



గణితం అంటే చాలా మంది బాలబాలికలు భయపడుతుంటారు. అయితే వారికి చిన్ననాటి నుంచి సులభ రీతిలో బోధిస్తే లెక్కలపై మక్కువ పెరిగే అవకాశం ఉంది. అలాగే ప్రదర్శనలో విద్యార్థులచేత పలు ఎగ్జిబిట్లను తయారు చేయిస్తే.. సబ్జెక్టుపై అవగాహన పెరుగుతుంది. పాఠశాలల్లో తరచూ గణిత క్విజ్‌ పోటీలు నిర్వహిస్తే మరింత మేలు.

– ఎం.నిర్మల, గణితం ఉపాధ్యాయురాలు, నంబర్‌2 పాఠశాల, తాండూరు

### వేగం, కచ్చితత్వమే గణితం



విద్యార్థులు చిన్నప్పటి నుంచి మాథ్స్‌ను మక్కువతో నేర్చుకోవాలి. లెక్కలు బాగా వస్తే.. గణితంలో ఎన్నో అద్భుతాలు చేయవచ్చు. గణితం అంటేనే వేగం, కచ్చితత్వం. చిన్నారులకు లెక్కలు సులభతరం కావడానికి ప్రత్యేక పద్ధతులు అనుసరిస్తున్నాం. గణిత మాంత్రికుడు రామానుజన్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలి. లెక్కల మాంత్రికులుగా మారాలి.

– శ్రీధర్‌రెడ్డి, గణితం టీచర్‌, జెడ్పీహెచ్‌ఎస్‌ జీవన్గి, బషీరాబాద్‌

### అబాకస్‌పై దృష్టి



గణితశాస్త్రాన్ని విద్యార్థులకు అర్థమయ్యే విధంగా బోధిస్తున్నాను. సరికొత్త విధానాలను అనుసరిస్తూ.. వారిలో మాథ్స్‌పై ఉన్న భయం పోగొట్టేందుకు కృషి చేస్తున్నా. వేదిక్‌ మ్యాథ్స్‌, అబాకస్‌పై దృష్టి సారించాం. జిల్లా, రాష్ట్ర స్థాయిలో సత్తా చాటేలా చిన్నారులను ప్రోత్సహిస్తున్నాం. వెనుకబడిన పిల్లలపై ప్రత్యేక దృష్టి పెట్టాము.

– జంగయ్య, ఉపాధ్యాయుడు, దోమ

### గణితం అంటే చాలా ఇష్టం



భానుప్రసాద్‌

**కొడంగల్‌ రూరల్‌:** 'గణితం అంటే నాకు చాలా ఇష్టం. సూత్రాలు, పరికరాలతో అవగాహన పెరుగుతుంది' అని విద్యార్థి భానుప్రసాద్‌ పేర్కొన్నాడు. పట్టణంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో పదో తరగతి చదువుతున్న బాలుడు.. మాథ్స్‌ టెస్ట్‌లో అత్యంత ప్రతిభ చూపుతాడని పాఠశాల సిబ్బంది వెల్లడిస్తున్నారు. గణితశాస్త్ర ఫోరం ఆధ్వర్యంలో నవంబర్‌11న నిర్వహించిన మండల స్థాయి పోటీల్లో సత్తాచాటి జిల్లా స్థాయికి ఎంపికయినట్లు తెలిపారు. డిసెంబర్‌ 11న జిల్లా కేంద్రంలో నిర్వహించిన పోటీ పరీక్షల్లో పాల్గొనట్లు చెప్పారు. ఇలా అనేక లెక్కల పోటీల్లో సత్తాచాటి అనేక బహుమతులు కైవసం చేసుకున్నాడని స్పష్టంచేశారు. ఈ సందర్భంగా బాలుడు బానును హెచ్‌ఎం మురళీధర్‌, గణితశాస్త్ర ఉపాధ్యాయులు రవికుమార్‌, ఉపాధ్యాయ బృందం అభినందించి.

### తోటివారికి ఆదర్శంగా..



వీరేశం, గణితం ఉపాధ్యాయుడు

**తాండూరు రూరల్‌:** 'గణిత శాస్త్రంపై పిల్లల్లో భయం పోవాలంటే.. లెక్కలపై సరైన అవగాహన కల్పించాలి. అందుకు టీఎల్‌ఎమ్‌(టీచింగ్‌ లర్నింగ్‌ మెటీరియల్‌)ను ఉపయోగించాలి. జీయో జీబ్రా, చాట్‌ జీపీటీ, ఐఎఫ్‌టీ లాంటి ఇన్ఫర్మేషన్‌ టెక్నాలజీని వినియోగించాలి' అని గణిత ఉపాధ్యాయుడు వీరేశం స్పష్టం చేస్తున్నారు. తాండూరు మండలం కరన్‌కోట్‌ జెడ్పీహెచ్‌ఎస్‌లో పనిచేస్తున్న ఆయన.. 15 ఏళ్లుగా తోటి గణిత ఉపాధ్యాయులకు ఆదర్శంగా నిలుస్తూనే.. వారికి గణితంలో మెళకువలు నేర్పుతున్నారు. జిల్లా స్థాయిలో పలు ప్రశంసలు పొందారు. నగరంలోని(ఎస్‌సీఈఆర్‌టి) రాష్ట్ర పరిశోధన, శిక్షణ కేంద్రం గణిత రిసోర్స్‌ పర్సన్‌గా ఆయన పని చేస్తున్నారు. సహోపాధ్యాయుల సహకారంతో అనేక గణిత పుస్తకాలు రాశారు.

### ఆటపాటలతో బోధన



బహుమతి అందజేస్తున్న స్పీకర్‌

**అనంతగిరి:** వికారాబాద్‌ పట్టణం కొత్తగడి జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయురాలు జి.జగదీశ్వరి ఆటపాటలతో గణితం బోధిస్తున్నారు. అందుకోసం ఇప్పటికే 10 పాటలు రాసి, వాటి రూపేణా పిల్లలకు అర్థమయ్యే రీతిలో లెక్కలు చెబుతున్నారు. ఇటీవల వికారాబాద్‌లో నిర్వహించిన జిల్లా సైన్స్‌ ఫెయిర్‌లో గణితం సబ్జెక్టులో ఉపాధ్యాయులు ప్రదర్శించే టీఎల్‌ఎం ప్రదర్శనలో ఆమె ఆటపాటలతో బోధన చెప్పి ఆకట్టుకున్నారు. దీంతో జగదీశ్వరి గణిత విభాగంలో జిల్లాలో ఉత్తమ టీఎల్‌ఎంగా ఎంపికయి.. రాష్ట్ర స్థాయి పోటీలో పాల్గొననున్నారు. ఎంపిక కావడంతో ఆమెకు స్పీకర్‌ ప్రసాద్‌కుమార్‌ బహుమతి అందజేశారు.

పరిగి: గణితం బోధిస్తున్న ఉపాధ్యాయుడు బిచ్చయ్య



సండే స్పెషల్‌

# సూత్రం పట్టుకో.. సులువుగా నేర్చుకో

**దుద్యాల్‌:** రెండు రెళ్లు నాలుగు.. మూడు రెళ్లు ఆరు.. ఒకటి రెండి కలిపితే మూడు.. ఐదు లోంచి మూడు తీసివేస్తే రెండు.. అంటూ ఏమీ చదువుకోని సామాన్యుడు సైతం తన చేతివేళ్లతో లెక్కించేలా మనిషి జీవితాన్ని గణితం పెనవేసుకుపోయింది. అయినప్పటికీ మనలో చాలా మందికి లెక్కలంటే భయం. మొదటగా ఆ భయాన్ని వీడి పట్టు సాధించాలని లెక్కల మాస్టార్లు స్పష్టం చేస్తున్నారు. ×మేము కూడా మొదట్లో గణితం భయంతో వణికిపోయాం. ఆందోళన చెందాం. కానీ.. క్రమంగా చింతవీడి మాథ్స్‌పై పట్టుసాధించాం¥ అని మాథ్స్‌ టీచర్లు పేర్కొంటున్నారు. నేర్చుకుంటే గణితం సులువని స్పష్టంచేస్తున్నారు. తెలుగు, హిందీ, ఆంగ్లం, సామన్య, సాంఘిక శాస్త్రంలో ప్రతి అక్షరం నేర్చుకోవాలి. లేదంటే సంబంధిత విషయం గుర్తుండదు. పరీక్షల్లో గానీ, తరగతి గదిలో కానీ ఆయా విషయాలను చూడకుండా చెప్పాలంటే ఇబ్బందిగా ఉంటుంది. కానీ గణితం అలా కాదు. కొన్ని ప్రత్యేక సూత్రాలను నేర్చుకుంటే జీవితాంతం ఉపయోగపడుతుంది. ఒక్క సూత్రంపైన సుమారు వందల లెక్కలు ఆధారపడి ఉంటాయి. సూత్రం నేర్చుకుంటే లెక్కల విలువలు మార్చి ఇచ్చినా సులువుగా చేయవచ్చు. సూత్రాలపై ఆధారపడి నేర్చుకునే సబెక్ట్‌ ఒక్క గణితం మాత్రమే. అందుకు ప్రతి విద్యార్థి మొదట సూత్రాలు నేర్చుకోవాలి.



ఒక సంఖ్యకు ఎగువ, దిగువ స్థానాలు తెలిపే చార్ట్‌ను చూపిస్తున్న విద్యార్థి

### వాస్తవరూపంలో సులభం



శ్రీతేజ, విద్యార్థిని

**కుల్కచర్ల:** మండల కేంద్రంలోని బాలికల జెడ్పీ పాఠశాలకు చెందిన శ్రీతేజ గణితశాస్త్రంలో జిల్లాలోనే మొదటిస్థానంలో నిలిచింది. ఇటీవల నిర్వహించిన మాథ్స్‌ డే పోటీల్లో అత్యంత ప్రతిభ చూపింది. గణితం అంటే ఆలోచన విధానంలో కఠినతరం కాని, వాస్తవరూపకంగా చాలా సులభతరమైనదని విద్యార్థిని పేర్కొంది. సైన్స్‌ఫేర్‌లో అత్యంత ప్రతిభ చూపి.. రాష్ట్రస్థాయికి ఎంపిక అయింది.

### కళ్లకు గంతలు కట్టుకొని..

**యాలాల:** కళ్లకు గంతలు కట్టుకొని గణితావధానం చేయడంలో అనంతప్ప దిట్ట. ఇది జ్ఞాపక శక్తి పెంపొందించుకునేందుకు ఎంతగానో ఉపయోగపడుతుందని ఆయన అభిప్రాయం. ఉపాధ్యాయుడిగా పనిచేసి రిటైర్డ్‌ అయిన గోకుల అనంతప్ప.. విశ్రాంత జీవితంలో గణితావధానం, జ్ఞాపకశక్తిపై పలు శిక్షణలు ఇచ్చారు. 2006లో హెల్త్‌ కేర్‌ ఇంటర్నేషనల్‌ సంస్థచే జాతీయ సమైక్యత అవార్డు, 2005, 2006లో ఇందిరా ప్రియదర్శిని అవార్డును సొంతం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గణితంపై విద్యార్థుల భయం పోగొట్టేందుకు అనేక కార్యక్రమాలు చేపట్టానని, వీటితో పాటు చిన్నారులకు నవోదయ, గురుకుల ప్రవేశ పరీక్షలకు శిక్షణ ఇస్తున్నానని తెలిపారు. జ్ఞాపక శక్తి పెంపొందించుకునేందుకు మెళకువలు నేర్పిస్తుంటానని వెల్లడించారు.



కళ్లకు గంతలు కట్టుకొని గణితావధానం చేస్తున్న అనంతప్ప

### పిల్లల్లో నైపుణ్యం పెంపొందిస్తాం



రామానుజన్‌ అనంతమైన అంకెల గమనం మనకు తెలుసు. అందుకే అతను విశ్వమంతా విశాలమైన ప్రపంచ చరిత్రలో ఒక ప్రకాశవంతమైన నక్షత్రంగా మిలిగి పోయారు. గణిత ఫోరం జిల్లా శాఖ ఆధ్వర్యంలో మండల, జిల్లా స్థాయి గణిత పోటీల్లో ప్రతిభ చూపిన వారిని ఆదివారం హయత్‌నగర్‌లో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీలకు పంపించాం. విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే మాథ్స్‌పై పట్టు సాధించాలి. పాఠశాల స్థాయిలో చిన్నారుల గణిత నైపుణ్యాలను అభివృద్ధి చేసేందుకు గణిత ఫోరం కృషి చేస్తుంది.

–వేణుగోపాల్‌, జిల్లా గణిత ఫోరం అధ్యక్షుడు, అనంతగిరి

### గణితం లేనిదే గమనం లేదు



నిత్య జీవితంలో ప్రతి మనిషికి గణితం లేనిదే గమనం లేదు. లెక్కలంటే విద్యార్థులు మానసికంగా ఒత్తిడికి గురవుతుంటారు. ఉపాధ్యాయుడిగానే కాకుండా.. నాకు గణితం బోధకుడిగా అందుతున్న ఆదరణ మరువలేనిది. ఆటపాటల ద్వారా లెక్కలు నేర్పుతాను. మా విద్యార్థులు గణితంలో జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రశంసలందుకున్నారు.

– క్రాంతి కుమార్‌, ఉపాధ్యాయుడు, హుసేన్‌పూర్‌, బొంరాస్‌పేట

### టీఎల్‌ఎంలతో బోధన



విద్యార్థులకు గణితం అర్థం కావడానికి రకరకాల పద్ధతులను అనుసరిస్తుంటాము. అందులో ఒకటి టీఎల్‌ఎంలతో బోధన చేస్తుంటాము. డిజిటల్‌ బోర్డుపై రాస్తూ వివరిస్తాము. ఇది చిన్నారులకు బాగా ఉపయోగకరంగా ఉంది. లెక్కలపై పట్టు సాధిస్తున్నారు. విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెంచేందుకు ఈ విధానం ఎంతగానో ఉపయోగపడుతుంది.

– సుధాకర్‌, గణితం ఉపాధ్యాయుడు, నంబర్‌వన్‌ పాఠశాల పరిగి

### టెస్ట్‌ ఎప్పుడుపెట్టినా.. వందశాతం



గణితం పరీక్ష ఎప్పుడు పెట్టినా.. నూటికి నూరు శాతం మార్కులు సాధిస్తాను. లెక్కలు అంటే నాకు చాలా ఇష్టం. ఉపాధ్యాయులను అనురిస్తుంటాను. వారు చెప్పిన పాఠాలను శ్రద్ధగా విని అర్థం చేసుకుంటాను. అనంతరం తరగతిలోని బోర్డుపై వివరించి, టీచర్లు, తోటి విద్యార్థులను మన్ననలు పొందుతున్నాను.

– అక్షయ, పదో తరగతి, మిట్టకోదూర్‌, ఉన్నత పాఠశాల, పరిగి

## ఆర్థిక సాయం

సాక్షి ఎఫెక్ట్‌..

**తాండూరు టౌన్‌:** 'పేదరికం.. చికిత్స భారం' శీర్షికతో శుక్రవారం 'సాక్షి' దినపత్రికలో ప్రచురితమైన కథనానికి పట్టణ వ్యాపారవేత్త దొరిశెట్టి సత్యమూర్తి స్పందించారు. కాలేయ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న వాల్మీకీనగర్‌వాసి రాజశేఖర్‌కు రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. మరింత మంది దాతలు ముందుకు వచ్చి సాయం చేయాలని కోరారు. ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి స్పందించి ప్రభుత్వం తరఫున మెరుగైన వైద్యం అందేలా చూడాలని కోరారు.



ఆర్థిక సాయం అందజేస్తున్న వ్యాపారి సత్యమూర్తి

## ప్రాణం తీసిన వివాహేతర సంబంధం

- మహిళ హత్య కేసును ఛేదించిన షాద్‌నగర్‌ పోలీసులు
- నిందితుడికి రిమాండ్‌
- వివరాలు వెల్లడించిన పట్టణ సీఐ విజయ్‌ కుమార్‌



వివరాలను వెల్లడిస్తున్న పట్టణ సీఐ విజయ్‌ కుమార్‌

**షాద్‌నగర్‌ రూరల్‌:** మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు.. ఆమెపై అనుమానం పెంచుకున్నాడు.. కన్నకూతురు ముందే తల్లిపై దాడి చేశాడు. దెబ్బలు తాళలేక మహిళ అక్కడే మృతిచెందింది. విషయం బయటకు తెలిస్తే కటకటాల పాలవుతానని గ్రహించి అక్కడి నుంచి పారిపోయాడు. ఈ ఘటనపై దర్యాప్తు చేపట్టిన పోలీసులు వారం రోజుల్లో కేసును ఛేదించి నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. శనివారం స్థానిక పోలీస్‌ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పట్టణ సీఐ విజయ్‌కుమార్‌ వివరాలను వెల్లడించారు. నారాయణపేట జిల్లా మక్తల్‌కు చెందిన పావని (35) తన కూతురు జ్యోతిశ్రీతో కలిసి కొంతకాలం క్రితం షాద్‌నగర్‌కు వచ్చింది. పట్టణంలో ప్లాస్టిక్‌ వ్యర్థాలను సేకరిస్తూ కూతురుతో కలిసి రైల్వేస్టేషన్‌, జాతీయ రహదారి సమీపంలో నివసిస్తోంది. కర్నూలు జిల్లా ఆలూర్‌ మండలం జోలాపూర్‌ గ్రామానికి చెందిన వడ్డె వెంకటేశ్‌ షాద్‌నగర్‌లో కూలీ పని చేస్తూ పట్టణంలోని బస్టాండ్‌, రైల్వేస్టేషన్‌ ప్రాంతాల్లో ఉండేవాడు. ఈ నేపథ్యంలో పావనికి వెంకటేశ్‌తో పరిచయం ఏర్పడింది. కొంత కాలం తర్వాత ఇది వివాహేతర సంబంధానికి దారి తీసింది. ఈనెల 15న రాత్రి సమయంలో బుచ్చిగూడ రోడ్డులోని బైపాస్‌ బ్రిడ్జి కింద నిద్రిస్తున్న పావనితో వెంకటేశ్‌ గొడవ పడ్డాడు. నిన్న (14వ తేదీ) ఎక్కడికి వెళ్లావని మృతురాలు పావనితో వాగ్వాదానికి దిగాడు. తన సొంత ఊరులో ఉన్న భర్త వద్దకు వెళ్లానని చెప్పడంతో కోపోద్రిక్తుడైన వెంకటేశ్‌ కర్రతో అమానుషంగా ఆమెపై దాడి చేశాడు. అప్పటికీ పావని మృతి చెందలేదని తెలుసుకుని ఇనుప సలాకతో తల, నుదుటిపై కొట్టడంతో రక్తస్రావమై చనిపోయింది. తల్లిపై దాడి చేస్తుండగా అడ్డు వచ్చిన జ్యోతిశ్రీపై కూడా దాడి చేశాడు. పోలీసులకు తెలిస్తే నేరం బయట పడుతుందని భావించిన వెంకటేశ్‌ తెల్లవారిన తర్వాత.. నీకు టీ తెస్తా నువ్వు అమ్మ దగ్గరే ఉండూ అంటూ జ్యోతిశ్రీకి చెప్పి సొంతూరుకు పారిపోయాడు. మహిళ హత్య కేసుపై దర్యాప్తు చేపట్టిన పోలీసులు సాంకేతిక ఆధారాలతో నిందితుడిని గుర్తించారు. వెంకటేశ్‌ కర్నూల్‌లో ఉన్నట్లు సమాచారం రావడంతో అక్కడికి వెళ్లి అతన్ని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం తమదైన శైలిలో విచారించగా నేరం అంగీకరించాడు. హత్యకు ఉపయోగించిన కర్ర, ఇనుప సలాక(సీకు)ను స్వాధీనం చేసుకున్న పోలీసులు వెంకటేశ్‌ను రిమాండ్‌కు తరలించారు. సైబరాబాద్‌ సీపీ అవినాష్‌ మహంతి, డీసీపీ రాజేశ్‌, అడిషనల్‌ డీసీపీ రామ్‌కుమార్‌ పర్యవేక్షణ, ఏసీపీ రంగస్వామి ఆధ్వర్యంలో పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి నిందితుడిని పట్టుకున్నారు. కేసును ఛేదించడంలో ప్రధాన పాత్ర పోషించిన పట్టణ సీఐ విజయ్‌కుమార్‌, డీఐ వెంకటేశ్వర్లు, ఎస్‌ఐ శరత్‌కుమార్‌, పోలీసు సిబ్బందిని అభినందించారు.

### కారు, బొలేరో ఢీ

పలువురికి గాయాలు

**పరిగి:** కారు, బొలేరో ఎదురెదురుగా ఢీకొనడంతో పలువురికి గాయాలయ్యాయి. ఈ సంఘటన మండల పరిధిలోని చింతల్‌చెరువు వద్ద శనివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌ నుంచి గుర్మిట్కల్‌ వెళ్తున్న కారు, మెట్లకుంట నుంచి పరిగి వెళ్తున్న బొలేరో చింతల్‌ చెరువు మూలమలుపు వద్ద ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో కారులో ఉన్న ముగ్గురికి, బొలేరో ఉన్న ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం పరిగి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

### గర్భిణి మృతికి కారణమైన వ్యక్తికి పదేళ్ల జైలు

**శంకర్‌పల్లి:** మద్యం మత్తులో బైక్‌ నడిపి, ఐదు నెలల గర్భిణీ మృతికి కారణమైన వ్యక్తికి ఎల్‌బీనగర్‌ కోర్టు పదేళ్ల జైలు, రూ.10 వేల జరిమానా విధించింది. శంకర్‌పల్లి సీఐ శ్రీనివాస్‌గౌడ్‌ తెలిపిన వివరాల ప్రకారం.. 2021లో చేవెళ్ల మండలం కందవాడ గ్రామానికి ఫిరంగి రవి, తన భార్య లక్ష్మిని ఆస్పత్రిలో చూపించేందుకు శంకర్‌పల్లికి వచ్చాడు. అనంతరం ఇద్దరూ బైక్‌పై తిరుగు ప్రయాణమయ్యారు. శంకర్‌పల్లి మున్సిపల్‌ పరిధిలోని రామంతాపూర్‌ వద్ద వెనక నుంచి మద్యం మత్తులో, అతివేగంగా బైక్‌పై వచ్చిన మాదారం వాసి అనిల్‌కుమార్‌ (24) వీరిని బలంగా ఢీకొట్టాడు. దీంతో లక్ష్మి బైక్‌పైనుంచి కిందపడిపోయింది. తలకు బలమైన గాయాలు కావడంతో ఆమెను శంకర్‌పల్లి ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందింది. శనివారం ఎల్‌బీనగర్‌ సెషన్స్‌ కోర్టు జడ్జి హరీష నిందితుడు అనిల్‌ కుమార్‌కు పదేళ్ల జైలు, రూ.10 వేల జరిమానా విధించింది.

## క్రికెట్‌ టోర్నీలో సత్తాచాటిన 'సహారా' జట్లు



సౌత్‌ జోన్‌ టి- 20 అండర్‌- 14లో రన్నరప్‌గా నిలిచిన తాండూరు సహారా క్రికెట్‌ అకాడమీ జట్టు

**తాండూరు టౌన్‌:** తెలంగాణ క్రికెట్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో నిర్వహించిన సౌత్‌ జోన్‌ టి–20 క్రికెట్‌ అండర్‌– 14 టోర్నీలో తాండూరుకు చెందిన సహారా అకాడమీ జట్టు క్రీడాకారులు సత్తాచాటారు. హోరాహోరీగా కొనసాగిన ఈ టోర్నీలో రన్నరప్‌గా నిలిచారు. ఈనెల 17నుంచి 20వ తేదీ వరకు నగరంలో నిర్వహించిన ఈ టోర్నీలో తమిళనాడు, కర్నాటక, ఒడిషా, ఆంధ్రప్రదేశ్‌, తెలంగాణ నుంచి హైదరాబాద్‌, తాండూరు సహారా అకాడమీ జట్లు పాల్గొన్నాయని నిర్వాహకులు తెలిపారు. తాండూరుకు చెందిన సాయి వర్షిత్‌ రెడ్డి 13 వికెట్లతో ఉత్తమ బౌలర్‌గా, కనవ్‌ పండిట్‌ 9 ఉత్తమ కీపర్‌, ఫీల్డర్‌గా అవార్డులు అందుకున్నారు. కోచ్‌ జగన్నాథ్‌ రెడ్డి వీరిని అభినందించారు.

## గోవా టు హైదరాబాద్‌

- కొత్త సంవత్సరం వేడుకలకు మద్యం తరలింపు
- 95 బాటిళ్లను స్వాధీనం చేసుకున్న ఎక్సైజ్‌ పోలీసులు



ఎక్సైజ్‌ పోలీసులు పట్టుకున్న మద్యం బాటిళ్లు

**అనంతగిరి:** కొత్త సంవత్సరం వేడుకల కోసం కొందరు వ్యక్తులు గోవా నుంచి తరలిస్తున్న మద్యం బాటిళ్లను ఎక్సైజ్‌ పోలీసులు పట్టుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి.. హైదరాబాద్‌కు చెందిన పలువురు యువకులు వాస్కోడీగామా రైలులో గోవానుంచి మద్యం బాటిళ్ల తరలిస్తున్నారు. ఈ విషయమై పక్కా సమాచారం అందుకున్న వికారాబాద్‌ ఎక్సైజ్‌ సూపరింటెండెంట్‌ విజయభాస్కర్‌, ఎస్‌ఐలు ప్రేంరెడ్డి, వీరాంజనేయులు సిబ్బంది వెళ్లి, తెల్లవారుజామున రైలులో తనిఖీలు నిర్వహించగా రూ.లక్ష విలువ చేసే 95 బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

## రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

**అనంతగిరి:** గొల్లగూడ– శంకర్‌పల్లి రైల్వే స్టేషన్‌ మధ్య రైలు కింద పడి ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన శనివారం వికారాబాద్‌లో చోటు చేసుకుంది. రైల్వే పోలీసుల వివరాల ప్రకారం.. ఉదయం గొల్లగూడ– శంకర్‌పల్లి మధ్య కి.మీ. నంబర్‌ 131బై 21–19 యూపీ లైన్‌ పట్టాలపై ఓ గుర్తు తెలియని వ్యక్తి రైలుకింద పడి మృతి చెందాడని స్థానికులు సమాచారం అందించారు. వెంటనే అక్కడికి చేరుకున్న పోలీసులు విరాలు సేకరించారు. మృతిని వద్ద చిరునామాకు సంబంధించిన ఆధారాలు లభించలేదు. మృతుడు గులాబీ రంగు చొక్కా, తెలుపు రంగు ప్యాంట్‌, మెడలో నల్లకి దారం అందులో రుద్రాక్ష, ఎడమ చెవికి పోగు ఉందని తెలిపారు. కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని వికారాబాద్‌ మార్చురీలో భద్రపర్చామని పేర్కొన్నారు.



మృతుడు